# నిప్పు... నిజం

-నిష్ఫల

ఆలోచన్లోంచి తేరుకున్నాడు ప్రతాపరావు.

ఈ పనికిరాని ఆలోచన్లు తన్ను నిలువునా కాల్చివేస్తున్నాయని వాపోయేవాడు. ఇవెందుకు వస్తూ వుంటాయో? భీతిల్లిన మొహం, బయటకు దాచలేకపోతున్నదా భయం. అతన్ని చూస్తే ఏదో పోగొట్టుకున్న వాడిలా డీలాగా కనిపిస్తాడు. అడిగిన వాళ్ళు అడగనే అడిగేవారు, "ఏం అలా వున్నారని" సమాధానం చెప్పలేక, చెప్పుకోలేక మొహం ఎటో తిప్పుకొని, తప్పుకునేవాడు. చూపరులు అంతగా విసిగించక "మన కెందుకులే" అనే నానుతున్న పదాన్నే వాడేసి వెళ్ళిపోయేవారు. అయితే, ప్రతాపరావు చిన్నగా బాధపడి, తన ప్రతాపాన్ని వేడి నిట్టూర్పులోనే చూపేవాడు. పాపం, అంతకన్నా ఏం చేయలేని నిస్సహాయుడిగా వుండిపోయేవాడు.

సేకరించిన సంగతి ప్రకారం ప్రతాపరావు ఓ రిటైర్డ్ ఓయస్. (ఆఫీసు సూపర్నెంటు). రైల్వేలో ఏదో డివిజన్‌లో చేసేవాడు. అప్పుడు తన రీవి ఆమడ దూరం విస్తరించేది. రోజుకో డ్రెస్ మార్చేవాడు. గమ్మన వాసనగొట్టే కియో కార్పిన్ హెయిర్ ఆయిల్ తలకు రాసేవాడు. సందర్భం ఏం అంటే, చక్కటి వంకీల జుత్తు. రెండు కుంజీల వెంట్రుకలను నుదిటిమీద వదిలేవాడు. అలా వదలడం మొహానికి ఎంతో అందం యిచ్చేది. సహోద్యోగులు కూడా అలానే అనే వారుట.

క్యాంటిన్ దగ్గర దర్జాగా కాఫీ తాగి అంతకన్నా దర్జాగా విల్సు సిగరెట్లు కాల్చేవాడు. తన్నెవరైనా చూస్తున్నారా అని చూపులు విసిరేవాడు. ఆపోజిటి సెక్స్ ఎవరేనా చూస్తే, తను వాళ్ళ పక్క చూడనట్లు నటించేవాడు. అలా అయితేనే వాళ్ళు తన్ను లైక్ చేస్తారని ఊహ. ఇలాంటి చిట్కాలు ఫ్రెండ్స్‌తో చెప్పి నవ్వించేవాడు.

అలాటి ప్రతాపరావు యిప్పుడు డీలాగా, నీర్సంగా ముడుచుకునిపోయిన బుగ్గలతో అదోలా వున్నాడు. అదే ఆయన అసంతృప్తి. కనబడకుండా దాద్దామని విశ్వప్రయత్నం. కానీ తెల్సినవాళ్ళు చూసి "రిటైరయి పోయాడ్రా, అరవై దాటి ఏనాడో అయింది" అని నవ్వే వాళ్ళు ప్రతాపరావు గెటప్ చూసి.

❍ ❍ ❍

చక్కటి ప్యాంటు. టకప్ చేసుకుని, వున్న వెంట్రుకల్ని నల్లగా చేసుకుని వీధిలోకి వెళ్ళేవాడు. ఎక్కువుగా తనకన్నా చిన్నవాళ్ళతో తిరగడానికి ప్రయత్నం చేసేవాడు. "నాకేం, గుండులా వున్నాను" అనుకొనేవాడు నిజాన్ని అణిచి. ఎప్పుడూ తెల్సిన వాళ్ళతో లేక తెలియని వాళ్ళతో మాట్లాడ్డానికి ప్రయత్నించే వాడు. బహుశ, యీయన వయస్సు వాళ్ళకు తెలియక పోవచ్చని కాబోసు. ఇంకా "యంగ్" అనిపించుకోవాలని తాపత్రయం కావొచ్చు! అంతలోనే నిజం నిప్పులా తాకి వళ్ళు కాలిన వాడిలా విలవిలా పోయేవాడు. మొహం డీలా అయిపోయేది. ఇంకేం వుంది. కందిరీగలు ఝూంకారం కొట్టినట్టు ఆలోచనలు మెదడును దొలిచేవి.

❍ ❍ ❍

ఆ రోజు ప్రతాపరావు తొమ్మిదిన్నరకే మంచి గెటప్‌లో రోడ్డు మీద పడ్డాడు. అందరూ తన్నే చూస్తున్నట్టనిపించింది. తను చూడనట్లే వెళ్ళిపోతున్నాడు. ఇంతలో- "హలో సార్, మీ కోసం యింటికి వెళ్ళేను" అన్నాడు ఆ పిల్చినవాడు. ప్రతాపరావు సాలోచనగా అతగాడి పక్క చూసేడు ఎందుకో అన్నట్లు. "మీకు కన్సెషన్, అనగా ఏడున్నర పాల పేకెట్ ఏడుకే అప్రూవల్ అయింది" అనేసాడు నవ్వుతూ.

ప్రతాపరావుకిది బోధపడలేదు. ఎందుకున్నట్లు చూసేడు.

"మీ మిసెస్‌గారు చెప్పే చేయమన్నారు. మీరు సీనియర్ సిటిజన్ కదండీ!".

ఆ మాట ప్రతాపరావు హృదయంలో తుమ్మముల్లు గుచ్చినట్లు "అబ్బా!" అనేసేడు మనసులోనే బయటకు కనిపించకుండా. చిరునవ్వు విసిరి సమాధానం చెప్పకుండా చిన్నగా చేయివూపి, ముందుకు నడిచేడు.

అప్రూవల్ తెచ్చినందుకు తృణమో ఫణమో యిస్తాడనుకున్న ఆ అబ్బాయి చిన్న మొహంతో వెళ్ళిపోయాడు.

"నమస్కారం సార్" సడన్‌గా వినిపించిన యీ నమస్కారం బ్యాంక్ మెట్లక్కుతున్న ప్రతాపరావు 'ఎవరా' అని చూసేడు. తెల్సిన మొహంలా లేదుమరి, ఎవరై వుంటారో, అనేసుకుని 'ఏమైనా నమస్కారం పెట్టేడు, తప్పదు, ప్రతి నమస్కారం చేసేడు.

"మీరీ బ్యాంకులోనే చేస్తున్నట్లుంది. నా లోన్ సంగతి చూడండిసార్. నాపేరు అప్పారావు. నా ఎకౌంటు నెం...

"ఆగాగు. నేనీ బ్యాంకులో చేయడం లేదు" తన్నింకా ఉద్యోగినే అనకున్నాడని లోలోపల సంబరపడిపోయాడు. గర్వం కూడా చిన్నగా తలెత్తింది మనసులో. అవును మరి, నా గెటప్ అలాంటిది మరి. ఒక్కసారి తన్ను తాను చూసుకున్నాడు. వివరుడిలా వున్నారు (అనుకున్నాడు) నల్లబరచిన తెల్ల జుత్తుని సుతారంగా మీదికి తోశాడు.

"మిమ్మలెక్కడో చూసేను" తిరిగి ఆ మనిషే అన్నాడు. అవునవును... మిమ్మల్ని రైల్వే ఆఫీసులో చూసేను. డి.ఆర్.ఎం. ఆఫీసు" తిరిగి ఉనికి తెలిపేడు.

ఆ మనిషి జ్ఞాపకశక్తికి అబ్బురపడి, "అవునన్నాను" "సార్", ఆ మనిషే అన్నాడు, "మా అబ్బాయి 'డి' గ్రూప్‌కి అప్లయి చేసేడు. కాస్త చూసి పెట్టండి".

ప్రతాపరావుకి ఏం చెప్పాలో అయోమయంలో పడి, హుందాగా తలూపి బ్యాంకులోకి దూరి, ఓ మూల వున్న కుర్చీలో కూలబడ్డాడు. రుమాలు తీసి మొహం హుందాగా తుడిచి మడతపెట్టి జేబులో తోసేడు. మెదడులో ఆ వ్యక్తే మెదల్తున్నాడు. తను ఫోజు కొట్టి అతని ఆశను పెంచేడు. తను చేసింది తప్పో ఒప్పో అనుకుంటే "తప్పే" అని మొట్టింది లోపలి వున్న అంతరాత్మ. అయినా తనే చేసేడు? ప్రతీవాడు తన్ను ఓల్డు ఫెలో క్రింద జమచేసి మాట్లాడుతున్నారు. "ఓ కే" అయామ్ ఓల్డు" అయినా ఎత్తిచూపడు.. అనుకోలేకపోయాడు. ఇంతలో తన నెంబ రొచ్చింది. లేచివెళ్ళి బుక్, విత్‌డ్రాయల్ ఫాం కిటికీలో పెట్టేడు. చిన్న ఎఫ్‌డీ కూడా వుంది. నెలనెలా దాని ఇంట్రస్టు తీసుకోడానికి సదుపాయం చేసుకున్నాడు. అందుకే పెన్షన్‌తో పాటు దాన్నీ డ్రా చేయడానికొచ్చేడు. మరో అయిదు నిమిషాల్లో డబ్బు బుచ్చుకుని పర్స్‌లో తోసేడు. పాస్‌బుక్ ఫేంటు జేబులో దాచేడు. ప్రతాపరావు వెనుక వున్న పెన్షనర్ ఇదంతా చూసి, వూరుకోక యిలా అన్నాడు.

"ఏం సార్, ఇంటరెస్టు తక్కువ వేసినట్టున్నాడు" అది విని, అతన్ని చూసే వీడివన్నీ చూసినట్టున్నాడు.

"లేదే?" అయినా ఎందుకెక్కువ, తక్కువ వేస్తారు? సమంగానే వేస్తారు కదా?"

"అదేంటి సార్, నాకూ వుంది. ఆరూ ఏభై వేస్తారు రేటు. మీకు పాతిక పర్సంటు తగ్గించేడు"

"అలా ఎందుకు వేస్తారూ?" అడక్కూడదనే అడిగేసేడు ప్రతాపరావు.

"మనం సీనియర్ సిటిజన్స్ కదండి ఏభై పర్సంటు ఎక్కువ వేస్తారు".

అదేమాట 'సీనియర్ సిటిజన్స్' అన్నాడు ఆ కుర్రాడు.

ఇదేదో పెద్ద డిగ్రీలా. ప్రతాపరావు ఆ మనిషికి జవాబివ్వకుండా చిన్నగా నవ్వి వెళ్ళిపోయాడు. వెళ్తున్నప్పుడు ఎవరివో మాటలు వెనుకనుంచి వినిపించేయి.

"ఆ వెళ్తున్న పెద్దాయన మా నాన్నగారి ఆఫీసులోనే చేసేవారు. మా నాన్న పోయి అయిదేళ్ళైంది".

ఆ మాటలు విన్న ప్రతాపరావు గతుక్కుమన్నాడు.

"వాళ్ళ నాన్న పోతే నేనూ పోవాల? అదేనా వాడి భావన?" వాళ్ళ నాన్న కన్నా ముందే రిటైరయ్యాను. గుండులా వున్నాను. సాధారణంగా వయస్సు మీద పడితే చావు దగ్గరవుతుంది". అయితే నేను ముసలివాడినా. ఓల్డు ఫెలోనా?" మనస్సు వప్పుకోలేదు. ఆలోచన్లు దొలుస్తున్నాయి. ఇంటికొచ్చి అద్దంలో చూసుకున్నాడు. తన గెటప్ తన్నే వెక్కిరిస్తున్నట్లుంది. నిజమే తను ముసలివాడినే, ఓల్డుఫెలోనే. తన గెటప్ 30ఏళ్ల క్రిందటిది కాదు. అలానే ఎలా వుంటాను? ఇది ఇంతేనా? గుండెలో పెద్ద బండపడినట్లు గుండెను పట్టుకున్నాడు ప్రతాపరావు.

❍ ❍ ❍

"ఏవండోయ్, మనకు పాలు లీటరు పద్నాలుగే నండీ" సంతోషంతో చెప్పింది పద్మావతి భర్తతో. అది విన్న ప్రతాపరావు యింకా ఏం చెప్తుందో అని వీధిలోకి జారుకున్నాడు. నడుస్తున్న ప్రతాపరావు తలకి రివ్వున వచ్చి తగిలిందో బంతి. వెంటనే ఓ కుర్రాడు వచ్చీ "సారీ తాతగారు" అనేసి బంతి బుచ్చుకుని తుర్రుమన్నాడు.

నిర్ఘాంతపోయాడు ప్రతాప్‌రావు. ఆ 'తాత'నే శబ్దం చెవుల్లో సీసం పోసినట్లు గిలగిలామని ఇంటికి తిరిగి వచ్చేసేడు.

❍ ❍ ❍

అన్నీ తెల్సిన మానవుడు భ్రమలోపడిపోతున్నాడు. మరుపు సహజం. దైవ నిర్ణయం. అది మంచి చేస్తుంది. తెచ్చుకున్న మరుపు, దాచుకున్న మరుపు, చెడు చేస్తుంది. ఇది హాస్యాస్పదం. ప్రతీ వాడూ తన లోపాన్ని దాస్తాడు. మరచిపోదామని విఫల ప్రయత్నం చేస్తాడు. పొలాల్లో వెన్ను నక్కినట్లే అబద్ధాలతో నిజం దాగుంది. ప్రతాపరావు లాంటివారు చాలా ఎక్కువగానే వుండొచ్చును. ముసలివాడన్నా, ముసలిది అన్నా కోపం వస్తుంది. కానీ అదీ సత్యం! ముసలితనాన్ని దాచకోడానికి అష్టకష్టాలు పడతారు. తెల్సిన అబద్ధం, నిజం కాని ప్రలోభం. నిజం నిప్పులాంటిది. దాని స్వభావం అది. ప్రతాపరావు లాంటి వాళ్ళు ఎంత యంగ్ గెటప్ వేసినా కాలం కాయివేస్తూనే వుంటుంది. మనిషి ఆలోచనల్లో కొట్టుమిట్టాడుతుంటాడు. బాల్య, యౌవన, వార్ధక్యాలు కాల నిర్ణయాలు. ఎవరూమార్చరు. అయినా అజ్ఞానమనే చీకటిలో తారట్లాడుతూ,అలాగే జీవిత ఆఖరిమజిలీ చేస్తాము.

చదువరులు ఇది మనస్సులో వుంచుకుని సహజంగా కాలం వెళ్ళబుచ్చాలని నా ఆకాంక్ష.

■